# పదో తరగతి తెలుగు పేపర్-1 మోడల్ పేపర్

**సమయం: 2 గం. 45 ని.** **గరిష్ట మార్కులు: 50**

## 1. అవగాహన- ప్రతిస్పందన

**(16 మార్కులు)**

కింది పద్యాలలో ఒకదానికి ప్రతిపదార్థం రాయండి.

4 × 1= 4 మా

1. “ఆ-యేమీ? యొక రాణివాసమును బుణ్యవాసమున్ దెచ్చినా
వా? యే హైందవుఁడైన నీ గతి నమర్యాదన్ బ్రవర్తించునే?
మా యాజ్ఞన్ గమనింపవో? జయ మదోన్మాదంబునన్ రేఁగి, నీ
యాయుస్సూత్రము లీవ త్రుంచుకొనేదో? యౌద్ధత్య మోర్వన్ జుమీ”

( లేదా )

తన చూ పంబుధిమీఁదఁ జాచి శ్రవణద్వంద్వంబు రిక్కించి వం
చిన చంచద్భుజముల్ సముత్కట కటీసీమంబులన్ బూన్చి తో
క నభోవీథికిఁ బెంచి యంఘ్రు లిఱియంగాఁ బెట్టి బిట్టూది గ్ర
క్కున నక్కొండ యడంగఁ ద్రొక్కి పయికిం గుప్పించి లంఘించుచోన్.

కింది పద్యాలలో ఒకదానిని పూరించి, భావాన్ని రాయండి. 4 × 1 = 4 మా

2. తనదేశంబు స్వభాష .............
.......దేవా ! భక్త చింతామణీ !

( లేదా )

దెసలను కొమ్మ లొయ్య
............. బ్రాఁకె సముత్సుకాకృతిన్

**ఈ కింది పరిచిత పద్యాన్ని చదివి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.** 4 × 1 = 4 మా

నెట్టుకొని కాయ బీఱెండ పట్టపగలు
తాను శిష్యులు నిల్లిల్లు దప్పకుండఁ
గాశికా విప్రగృహ వాటికల నొనర్చు
నఖిల విద్యాగురుండు భిక్షాటనంబు.

ప్రశ్నలు :

3. పై పద్యంలో పేర్కొన్న పట్టణం ఏది?
4. అఖిల విద్యాగురుడు అంటే ఎవరు?
5. విద్యాగురుడు ఎవరితో కలిసి భిక్షాటనకు వెళ్ళాడు?
6. పై పద్యం ఆధారంగా ఒక ప్రశ్నను తయారు చేయండి.

**ఈ కింది పరిచిత గద్యాన్ని చదివి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

4 × 1= 4 మా

‘బాబూ ! ఇది వేపచెట్టు. సహజంగా ‘వేపచెట్టు’ అని చెవినిపడడంతో ‘చేదు’ అన్న భావన మనసులో మెదులుతుంది. అయితే ఆ వేపచెట్టును ఆశ్రయిస్తే – నీడనిస్తుంది. దినమూ ఓ కాయ నమిలి మింగగలిగితే దీర్ఘవ్యాధుల్నే నయం చేస్తుంది. పంటిపుల్లగా నోటి జబ్బుల్ని పోగొడుతుంది. అలాగే బాబూ! ‘అడక్కతినేవాళ్ళు అని’ పట్టించుకోకుంటే ఆ బతుక్కే అంకితమైపోయి అనామకులై పోతారు. ఒక విధంగా చెప్పాలంటే వాళ్ళు కొడిగట్టిన దీపాలు. కాసింత సానుభూతి, ఓపికను రంగరించి కొడినలా తట్టేసి తగినంత చమురుపోసి వత్తిని ఎగదోస్తే – అవి గోరంత దీపాలే కావచ్చు ఏ నాటికో ఒకనాటికి అవి కొండంత వెలుగునిస్తాయి!’’

ప్రశ్నలు :

7. కొడిగట్టిన దీపాలతో రచయిత ఎవరిని పోల్చారు?
8. చేదు అన్న భావన ఎప్పుడు మనసులో మెదులుతుంది ?
9. దీర్ఘ వ్యాధులు ఎప్పుడు నయమవుతాయని రచయిత భావన?
10. పై పేరా ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి?

## 2. వ్యక్తీకరణ - సృజనాత్మకత

( 22 మార్కులు )

**ఈ కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.** 7x2 = 14 మా

11. ధన్యుడు పాఠ్యభాగ రచయిత గురించి మీకు తెలిసిన విషయాలు రాయండి.
12. వచన కవిత ప్రక్రియను గురించి రాయండి.
13. వెన్నెలను వర్ణించడానికి కవి ఎన్నుకున్న అంశాలను రాయండి?
14. ‘ప్రతివాళ్ళు ప్రశ్నించారు చరిత్ర సాగిన క్రమాన్ని’ అని రచయిత్రులు అనడంలోని ఆంతర్యమేమిటి?
15. సముద్రలంఘనం పాఠ్యభాగ నేపథ్యాన్ని రాయండి.
16. కష్టం ఒకళ్ళది. ఫలితం మరొకళ్ళది అని అనడంలో రచయిత ఉద్దేశం ఏమై ఉంటుందో రాయండి.
17. చిత్రగ్రీవాన్ని గురించి మీకు ఆశ్చర్యాన్ని కలిగించిన విషయాలు ఏవో రాయండి.

**ఈ కింది ప్రశ్నలకు పది లేక పన్నెండు వాక్యాలలో సమాధానాలు రాయండి.** 2 × 4 = 8 మా

18. మాణిక్య వీణ పాఠ్యభాగ సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

( లేదా )

మాతృభావన పాఠం ఆధారంగా శివాజీ వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.

19. ‘పల్లెటూళ్ళు ప్రశాంత జీవిత సౌఖ్యానికి పుట్టిళ్ళు’ దీనిని సమర్థిస్తూ రాయండి.

( లేదా )

గోరంత దీపాలు కథలో వృద్ధుని పాత్ర స్వభావం, గొప్పదనాన్ని రాయండి.

## 3. భాషాంశాలు

( 12 మార్కులు )

20. శివాజీ కళ్యాణి దుర్గాన్ని సాధించాడు. వీరులకు సాధ్యం కానిది లేదు కదా! ఇందులోని అలంకారాన్ని గుర్తించి, లక్షణం రాయండి. 1x2 = 2
21. ఈ కింది పద్య పాదాలలో ఒక దానికి లఘుగురువులు గుర్తించి, గణవిభజన చేసి, పద్యం పేరు, యతి, ప్రాసలను తెలపండి. 1x4=4

నీరము తప్త లోహమున నిల్చి యనామకమై నశించు నా

(లేదా)

ఒడలు వడసిన తమ తండ్రి వడువు దోప

ఈ కింది ప్రశ్నలకు సూచించిన విధంగా జవాబులు రాయండి.

12 × ½ = 6

22. భరతమాత స్మితకాంతి అందరినీ ఆకట్టుకున్నది.
గీతగీసిన పదానికి కింద ఇవ్వబడిన అర్థాలలో సరైన దానిని గుర్తించి రాయండి.
చిరునవ్వుల వెలుగు; వెలుగుల జిలుగులు;
వెలుగు రేఖలు ;
23. ఆనంద్ సాధించిన విజయంలోని మర్మమును స్నేహితులు గుర్తించారు.
గీతగీసిన పదానికి సరైన అర్థమును రాయండి.
24. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు. అహిమకరుడు పడమర అస్తమిస్తాడు.
గీతగీచిన పదాలకు సరైన పర్యాయ పదాలను గుర్తించి రాయండి.
ఎ) భాస్కరుడు, చంద్రుడు బి) చంద్రుడు, భానుడు
సి) భానుడు, ఇనుడు డి) ఇంద్రుడు, ఇనుడు
25. ఆంధ్రప్రదేశ్ కీర్తి పతాకం విను వీధులలో రెపరెపలాడాలి. ఎంతోమంది ఆంధ్రప్రదేశ్ యశస్సును పెంచారు.
పై వాక్యాలలోని సమానార్థక (పర్యాయ) పదాలను గుర్తించి వేరుగా రాయండి.
26. హరిహర సుతుడు అయ్యప్ప.
గీత గీచిన పదానికి సరైన నానార్థాలు రాయండి.
27. పతిని సేవించుటయే వ్రతముగా కలది.
పై వాక్యానికి వ్యుత్పత్తి పదాన్ని రాయండి.
28. మన కవులు రాసిన కవితలు భారతి మెడలో అలంకరించిన హారాలు.
గీతగీచిన పదానికి ఈ కింది పదముల నుంచి సరైన వికృతి పదాన్ని గుర్తించి రాయండి.
కయిత ; కైత ; కపిత ;
29. నాయమును కాపాడుట జనులందరూ తమ కర్తవ్యంగా భావించాలి.
గీతగీసిన పదానికి సరైన ప్రకృతి పదాన్ని రాయండి.
30. రైతులు తమ వరి పంటను సంవత్సరాదికి నూర్చుకుంటారు.
గీతగీసిన పదాన్ని విడదీసి రాయండి.
31. సాయిప్రసాద్‌కు పాల మీఁగడ అంటే చాలా ఇష్టం.
గీతగీసిన పదంలోని సంధిని గుర్తించండి.
32. చంపకవతి పట్టణంలో అనేక మంది సన్యాసులు నివసిస్తుండేవారు.
గీత గీసిన పదం ఏ సమాసమో రాయండి.
33. కింది వాక్యంలో విశేషణ పూర్వపద కర్మధారయ సమాసానికి చెందిన పదాన్ని గుర్తించి రాయండి.
హిరణ్యకుడు నిర్జనవనము నందు వాసము చేయుచుండెను.

## సమాధానాలు

### అవగాహన – ప్రతిస్పందన

1. ఆ- యేమీ? = ఆ... ఏమిటి?
పుణ్య + ఆవాసమున్ = పుణ్యానికి నిలయమైన
ఒక = ఒక

www.sakshieducation.com

రాణివాసమును = రాణివాసాన్ని
తెచ్చినావా? = బందీగా తీసుకొచ్చావా?
ఏ హైందవుఁడు + ఐనన్ = హైందవుడు ఎవడైనా
ఈ గతిన్ = ఈ విధంగా
అమర్యాదన్ = మర్యాద తప్పి (మర్యాద లేకుండా)
ప్రవర్తించును + ఏ = ప్రవర్తిస్తాడా?
మా + ఆజ్ఞన్ = నా ఆజ్ఞను
గమనింపవు + ఓ = గమనించలేదా? (పట్టించుకోలేదా?)
జయ = (యుద్ధంలో) విజయం పొందిన
మద + ఉన్మాదంబునన్ = గర్వం మత్తులో
రేఁగి = అతిశయించి
నీ = నీ యొక్క
ఆయుః + సూత్రములు = ప్రాణాలనే సూత్రాలు (దారాలు)
ఈవ = నీవే
త్రుంచుకొనెదు + ఓ = తెంచుకుంటావా?
ఔద్ధత్యము = ఈ తెగింపును
ఓర్వన్ + సుమీ = సహించను సుమా!

(లేదా)

తన చూపు = (హనుమంతుడు) తన దృష్టిని
అంబుధి మీదన్ = సముద్రము మీద
చాచి = ప్రసరింపజేసి
శ్రవణద్వంద్వంబు = రెండు చెవులను
రిక్కించి = రిక్కించి
వంచిన = మేను వంచి
చంచత్ + భుజముల్ = కదిలిస్తున్న చేతులను
సముత్కట = మిక్కిలి బలము గలిగిన
కటీ సీమంబులన్ = నడుము భాగము నందు
పూన్చి = ఆనించి
తోక = తోకను
నభః + వీథికిన్ = ఆకాశ మార్గానికి
పెంచి = పెంచి
అంఘ్రులు = పాదాలు
ఇఱియన్ + కాన్ = దగ్గరగా
పెట్టి = పెట్టి
బిట్టు + ఊది = గట్టిగా గాలిని పీల్చి
ఆ + కొండ = ఆ కొండను (మహేంద్ర గిరిని)
గ్రక్కునన్ = శీఘ్రముగా/ఒక్కసారిగా
యడంగన్ + త్రొక్కి = అణగదొక్కి
పయికిన్ = ఆకాశములోకి
కుప్పించి = ఊపిరి బిగబట్టి
లంఘించుచోన్ = దాటుచున్నప్పుడు(దాటాడు)

2. తనదేశంబు స్వభాష నైజమతమున్
అస్మత్సదాచారముల్
తనదేహాత్మల నెత్తెఱంగున సదాతానట్లు
ప్రేమించి, త
ద్ఘనతా వాప్తికి సాధనంబులగు
సత్కార్యమ్ములన్ జేయఁగా
అనువౌబుద్ధి యొసంగుమీ ప్రజకు దేవా!
భక్త చింతామణీ!

**భావం:** భక్తులపాలిట చింతామణియైన ఓ స్వామీ! ఎవరైనా తన శరీరాన్ని, ఆత్మను ఎట్లా అభిమానిస్తారో అట్లాగే తన దేశాన్ని, తన భాషను, మతాన్ని, ఆచారాన్ని కూడా అభిమానించేటట్లు, వాటి ఔన్నత్యానికి సాధనాలైన మంచి పనులను చేసేటట్లు తగిన బుద్ధిని ప్రజలకు ప్రసాదించుమని వసురాయ కవి భగవంతుణ్ణి కోరాడు.

(లేదా)

దెసలను కొమ్మ లొయ్య నతిదీర్ఘములైన కరంబులన్ బ్రియం
బెసఁగఁగ నూఁది నిక్కి రజనీశ్వరుఁ డున్నతలీలఁ బేర్చు నా
కస మను పేరి భూరుహము కాంత నిరంతర తారకా లస
త్కుసుమ చయంబు గోయుటకొకో యనఁ బ్రాంకె సముత్సుకాకృతిన్.

**భావం:** దిక్కులనే కొమ్మలతో, ప్రకాశించే చుక్కలనే పూవులతో పెద్ద చెట్టులాగా కనిపిస్తున్నది ఆకాశం. తన పొడవైన చేతులతో ఆ పూవులను అందుకునేందుకా అన్నట్లు చంద్రుడు మిక్కిలి ఉత్సాహంతో విజృంభించాడని ఎర్రన వర్ణించాడు.

3. కాశీపట్టణం
4. వ్యాసుడు
5. శిష్యులతో కలిసి
6. విప్రగృహ వాటికలు అంటే ఏమిటి?
7. అడక్కతినేవాళ్లను
8. వేపచెట్టు అని వినగానే
9. రోజూ ఒక వేపకాయ నమిలి మింగగలిగితే
10. ఏవి కొండంత వెలుగునిస్తాయి?

11. ధన్యుడు పాఠ్యభాగ రచయిత పరవస్తు చిన్నయ సూరి **కాలం :** 1809 – 1862 (19వ శతాబ్దం)
**జన్మస్థలం:** తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లాలోని పెరంబుదూరులో జన్మించారు.
**తల్లిదండ్రులు:** శ్రీనివాసాంబ, వేంకట రామానుజాచార్యులు
**రచనలు:** అక్షర గుచ్ఛము, ఆంధ్ర కాదంబరి, పద్యాంధ్ర వ్యాకరణం, బాల వ్యాకరణం, నీతి చంద్రిక, శబ్దలక్షణ సంగ్రహం మొ.
**బిరుదు :** 'సూరి' – సూరి అంటే పండితుడు.
**ఇతర విషయాలు:** చిన్నయ సూరి తెలుగు, తమిళం, సంస్కృతం, ఆంగ్ల భాషలలో పండితుడు. ఈయన రచించిన 'బాల వ్యాకరణం' ఈనాటికీ ప్రామాణిక గ్రంథము. 'నీతిచంద్రిక–బాల వ్యాకరణం'లక్ష్య లక్షణ గ్రంథాలుగా ప్రసిద్ధి పొందాయి.

12. ఆధునిక యుగంలో ఒక ముఖ్యమైన సాహిత్య ప్రక్రియ వచన కవిత. ఇది ఛందోబద్ధత లేని కవితా ప్రక్రియ. పద్య, గేయ ప్రక్రియలలో ఉండే ఛందస్సుతో సంబంధం లేకుండా, వ్యవహారిక భాషలో రాసే కవితను వచన కవిత అంటారు. ఇది చిన్న చిన్న పదాలు, వాక్యాలతో ధ్వని గర్భితంగా ఉంటుంది. ఎంతో మంది వర్ధమాన కవులు, కవయిత్రులు ఈ ప్రక్రియ ద్వారా లోతైన భావాలను కూడా తేలికగా, సూటిగా వ్యక్తీకరిస్తున్నారు.

13. ఆదిశేషుని పానుపును, చంద్రకాంత శిలలను, చకోర పక్షులను, కలువపూలను, స్త్రీల నవ్వులను అంశాలుగా తీసుకొని ఎర్రన కవి వెన్నెలను వర్ణించాడు. చంద్రబింబం పాలసముద్రంలోని ఆదిశేషుని పానుపు లాగా కనిపిస్తున్నది. చంద్రుని వెన్నెల వర్షంతో చంద్రకాంత శిలలు కరుగుతున్నాయి. విహరిస్తున్న చకోర పక్షుల రెక్కలను తాకి, విచ్చుకున్న కలువ పూలను తనవైపు ఆకర్షిస్తున్నది. అందమైన స్త్రీల అద్భుతమైన చిరునవ్వులా తెల్లని కాంతిని అధికం చేస్తున్నది.

14. 'మహిళావరణం' పుస్తకం రూపొందించే క్రమంలో రచయిత్రులు చాలామంది స్త్రీలను కలిశారు. సమాజంలో ఎంతో ఘర్షణపడి, నిగ్గుదేలి కొత్త చరిత్రను సృష్టించిన మహిళలెందరో వారిలో ఉన్నారు. కందుకూరి రాజ్యలక్ష్మి, శోభాలత వంటి వారు స్త్రీల జీవితాలలో మార్పులు తీసుకురావాలనీ, వెలుగులు నింపాలనీ తాపత్రయ పడినవారే. స్త్రీలను ఎదగకుండా బంధిస్తున్న పితృస్వామ్య సమాజ అవలక్షణాలను ప్రశ్నించిన పావలా శ్యామల వంటివారూ, జీవనోపాధికై పోరాడిన సరిదె మాణిక్యాంబ లాంటి ఎంతోమంది స్త్రీలు చరిత్ర సాగిన క్రమాన్ని, వారికి జరిగిన అన్యాయాలను ప్రశ్నించారని రచయిత్రుల ఆంతర్యం.

15. సీతాన్వేషణలో రామలక్ష్మణులు కిష్కింధకు చేరుకొని సుగ్రీవునితో స్నేహం చేస్తారు. సుగ్రీవుడు సీతను వెతకడానికి వానర సైన్యాన్ని నాలుగు దిశలకు పంపిస్తాడు. ఆంజనేయుని బృందం దక్షిణ దిశకు వెళ్తుంది. జాంబవంతుని ప్రోత్సాహంతో ఆంజనేయుడు మహేంద్రగిరి నుంచి సముద్ర లంఘనానికి సిద్ధపడడమే ఈ పాఠ్యాంశ నేపథ్యం.

16. పల్లెటూళ్లలో భూకామందులు తమ పొలాలను తాము సేద్యం చేసుకోవడం, రైతులు వాటిని కౌలుకు ఇవ్వడం జరుగుతుంది. రైతు ముందుగా పండిన పంటలో ఇనాందారులకు కౌలు ప్రకారం శిస్తు చెల్లిస్తాడు. శిస్తు చెల్లించగా మిగిలిన ధాన్యం అతని పెట్టుబడులకు సరిపోతుంది. రైతుకు ఏమీ మిగలదు. ఏమీ కష్టపడని ఇనాందారుకు మాత్రం పూర్తిగా లాభం చేకూరుతుంది. కాబట్టే రచయిత కష్టం మాత్రం రైతులది. ఫలితం మాత్రం ఇనాందారుదని తన ఉద్దేశ్యాన్ని ప్రకటించాడు.

17. చిత్రగ్రీవం తండ్రి వేగాన్ని, తల్లి తెలివితేటలను పుణికి పుచ్చుకుంది. దాని మెడ పుట్టినపుడు మామూలు గానే ఉన్నా క్రమేపీ రంగుల హరివిల్లులా మారుతుంది. అది నీళ్ళు త్రాగడం, ఎగిరే ప్రయత్నం చేయడం, ఏపుగా పెరగడం అన్నీ ఒకదాని తరువాత ఒకటిగా జరిగిపోయాయి. అంతేగాక చీమను ముక్కుతో పొడిచి చంపి పశ్చాత్తాపపడడం మొదలగు అంశాలన్నీ మాకు ఆశ్చర్యాన్ని కలిగించాయి.

18. 1) మంత్రాలతో చింతకాయలు ఎలా రాలవో, అలాగే పద్యాల ధాటితో చింతలు తొలగిపోవు. యంత్రాలతో రోగాలు నయం కానట్లే, తంత్రాలతో సమాజ సమస్యలు దారికిరావు.
2) కడుపులో కేన్సరుతో సంఘం బాధపడుతూ వుంటే, అంతరిక్షంలోకి రాకెట్లు పంపితే ఏమి ప్రయోజనమని కవి భావన. ప్రకృతిని తన అధీనంలోకి తెచ్చుకొని ప్రకృతిలోని

రంగులనూ, ధ్వనులను అనుకరించాడు.

3) మానవుడు గుహలలో జీవించే ఆదిమ కాలంలోనే గోడలపై జంతువుల బొమ్మలు గీశాడు. ఎండిన చెట్లు చిగిర్చేలా పాడాడు. గజ్జెకట్టి నాట్యం చేశాడు.
4) 'చక్రం' కనుగొన్న రోజు, 'లిపి'తో రాసిన రోజు, నిప్పును కనుగొన్న రోజు, మానవ చరిత్రలో మంచిరోజులు. ధాన్యం పండించిన రోజు. కళలను పండించిన రోజు గొప్ప రోజులు.
5) కళలు, కవితలు, విజ్ఞానం, ప్రజ్ఞానం కలగలిసి మానవుని మహోన్నతంగా నడిపిస్తాయి. నేల నుంచి ఎదిగి మానవుడు ఆకాశాన్ని అందుకున్న చిన్నవాడు.
6) అనాదిగా నడుస్తున్న ఈ మానవుడి జీవనయాత్రలో కళాకవితలూ, జ్ఞాన విజ్ఞానాలూ మానవుడి వెంటనే వుండి, అతనితో నడుస్తూ, అతణ్ణి నడిపిస్తున్నాయి.

(లేదా)

**శివాజీ వ్యక్తిత్వం:** వ్యక్తిత్వం అంటే చెప్పిన మాటకు, చేసిన పనికి తేడా లేకుండా ఉండడం.

**ధర్మమూర్తి:** శివాజీ మహారాజు ధర్మప్రభువు. శత్రు దుర్గాలను జయించినప్పుడు అక్కడ స్త్రీలను అవమానించవద్దనీ, గోవులకు, బ్రాహ్మణులకు హాని కలిగించవద్దనీ తన సర్దారులను ఆజ్ఞాపించిన ధర్మమూర్తి.

**పశ్చాత్తాప హృదయుడు:** యవనకాంతను విడిపించి, తన సర్దారుల వల్ల తప్పు జరిగిందని, తనను మన్నించమనీ, ఆమెను పూజించి ఇంటికి పంపాడు.

**క్షమామూర్తి:** సోన్‌దేవుడు తాను కావాలని తప్పుచేయలేదని, విజయగర్వంతో తన కళ్ళు మూసుకుపోయాయనీ చెప్పి తనను మన్నించమని కోరితే, అతని నిర్దోషిత్వాన్ని గ్రహించి క్షమించాడు.

**పరస్త్రీలను తల్లిగా భావించడం:** పతివ్రతలు భూలోకాన తిరిగే పుణ్యదేవతలని భావించడం, వారు భారతదేశ భాగ్యకల్పలతలు అనడం, స్త్రీమూర్తులు అగ్నిజ్వాలల వంటివారు అనడం.

**తప్పును సరిదిద్దడం:** ధర్మప్రభువైన శివాజీ యవనకాంతను తన మాతృమూర్తిగా గౌరవించి, సన్మానించి, కల్యాణి సర్దారును మంచిమాటలతో ఆదరించి, బీజాపురం పంపిన సహృదయుడు.

19. పల్లెటూళ్లలో జీవితం ప్రశాంతంగా ఉంటుంది. మంచి గాలి, ఎండ ప్రతి ఒక్కరికీ లభిస్తుంది. అక్కడ చక్కని ప్రకృతి శోభ ఉంటుంది. పచ్చని పొలాలు కళకళలాడుతూ, గాలికి తలలాడిస్తూ గ్రామ ప్రజలను సుఖసంతోషాలతో ముంచెత్తుతాయి.

ప్రజలందరికీ పాడిపంటలు ఉంటాయి. పొయ్యి కిందికీ, పొయ్యి మీదికి వారికి కావలసినవన్నీ అక్కడే దొరుకుతాయి. గ్రామంలో చేతివృత్తులవారు ఒకరిని ఒకరు అన్నదమ్ములుగా భావిస్తూ పరస్పరం ఒకరి కొకరు సాయపడతారు.

పల్లెల్లో ఒకరి ఇంట్లో పెళ్లయితే ఊరందరికీ అది పండుగ. పల్లెలలో ముఖ్యంగా సంక్రాంతి పండుగకు ముగ్గులు, గొబ్బిళ్ళు, భోగిమంటలు, సంక్రాంతి ప్రభలు మహావైభవంగా తీర్థాలూ సాగుతాయి. హరిదాసులు, గంగిరెద్దులు, పగటి వేషధారులూ, వారి చక్కని పాటలూ ఆనందాన్ని ఇస్తాయి.

గ్రామీణులు ఆనందంగా నవ్వుతూ కళకళలాడుతూ ఒకరిని ఒకరు బంధుత్వంతో పలకరించుకుంటూ, కష్టసుఖాల్లో పాలుపంచుకుంటారు. గ్రామాలు పాడిపంటలకు నిలయాలు. అవి ప్రకృతి రమణీయతకు పుట్టిళ్లు.

(లేదా)

1. వృద్ధుడు దీనజన బాంధవుడు. విద్యానగరం అనే విద్యాలయం కట్టించి, బాలబాలికలకు వసతి గృహాలు, గ్రంథాలయం, ప్రార్థనాలయం ఏర్పాటుచేశాడు.
2. వృద్ధుడు విద్యానగరంలో మకుటంలేని మహారాజు. దిక్కులేనివారినందరినీ అక్కడకు చేర్చి, వాళ్లకు విద్యా బుద్ధులు నేర్పించేవారు. దానికైన ఖర్చు అంతా ఆయనే భరించేవాడు.
3. రైల్లో అడుక్కుతింటున్న పిల్లవాణ్ణి తనతో తీసుకువచ్చి చదువు చెప్పించి, పెళ్లి చేశాడు. పిల్లవాడు ప్రతి పుట్టినరోజుకీ వచ్చి ఈ వృద్ధుడిని కలిసి కృతజ్ఞత వెల్లడించేవాడు.
4. విద్యానగరంలో చదువుకొంటున్న పిల్లల్ని చూసి వృద్ధుడు ఆనందానుభూతితో తేలిపోయేవాడు. వృద్ధుని మాటలు అక్షర సత్యాలు. ఎన్నో కొడిగట్టిన దీపాలకు అతను ఆశ్రయం ఇచ్చాడు. ఆ వృద్ధుడు వెలిగించిన ఎన్నో గోరంతదీపాలు కొండంత వెలుగు నిచ్చాయి.

## భాషాంశాలు

20. **అర్థాంతరన్యాస అలంకారం.**

లక్షణం : విశేష విషయాన్ని సామాన్య విషయంతో, సామాన్య విషయాన్ని విశేష విషయంతో సమర్థించి చెప్పడాన్ని అర్థాంతరన్యాస అలంకారం అని అంటారు.

21. U I I   UI U   I I I U I I   U I I  U IU  I U

**నీ ర ము  తప్త లో  హమున  ని ల్చియ  నామక  మై నశిం చునా**

భ   ర   న   భ   భ   ర   వ

- ఈ పద్య పాదంలో భ, ర, న, భ, భ, ర, వ అనే గణాలు వచ్చాయి.
- 1వ అక్షరమైన 'నీ'కు 10వ అక్షరమైన 'ని'కు యతిమైత్రి చెల్లింది.
- 2వ అక్షరం ప్రాసాక్షరం.
- ఈ లక్షణాలను బట్టి పై పద్యపాదం 'ఉత్పలమాల' అనే పద్యానికి చెందినది.

(లేదా)

I I I  I I I I  I I  UI   I I I  UI

**ఒడలు వడసిన  తమ తండ్రి  వడువు దోప**

న   నల   సల   న   హ

- ఈ పద్య పాదంలో ఒక సూర్య గణం (న), రెండు ఇంద్ర గణాలు (నల, సల) తిరిగి రెండు సూర్య గణాలు (న, హ) వచ్చాయి
- రెండవ అక్షరమైన 'డ'కు 4వ గణ రెండవ అక్షరమైన 'డు' కు ప్రాసయతి చెల్లింది.
- ఈ లక్షణాలను బట్టి పై పద్యపాదం 'తేటగీతి' అనే పద్యానికి చెందినది.
- ఈ పద్యానికి ప్రాస నియమం ఉండదు. (సూర్యుడొక్కరుండు సురరాజులిద్దరు దినకర ద్వయంబు తేటగీతి అని లక్షణం)

22. చిరునవ్వుల వెలుగు
23. రహస్యము
24. సి) భానుడు, ఇనుడు
25. కీర్తి, యశస్సు
26. విష్ణువు, కోతి, ఇంద్రుడు
27. పతివ్రత
28. కైత
29. న్యాయము
30. సంవత్సర + ఆది
31. ప్రాతాది సంధి
32. సంభావనా పూర్వపద కర్మధారయ సమాసం
33. నిర్జనవనము

www.sakshieducation.com